



పరిమితి దాటగానే దుకాణాలు బంద్

- సమయం కాకముందే మద్యం అమ్మకాల నిలిపివేత
- ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ చర్యలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 13: మద్యం అమ్మకాలపై పరిమితి నిర్ణయం బెల్టు షాపు నిర్వాహకులకు వరంగా మారింది. మందుబాబులకు మాత్రం జేబుకు చిల్లుపడుతోంది. మామూలుగా అయితే ఉదయం 11 గంటలకు మద్యం దుకాణాలు తెరిచి రాత్రి 9 గంటలకు మూసేయాల్సి ఉంది. ఎన్నికల నేపథ్యంలో మద్యం పక్కదారి పట్టకుండా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులకు పరిమితులు విధించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గత ఏడాది ఏప్రిల్‌లో ప్రతి దుకాణంలోని అమ్మకాల లెక్కలు చూసి ఆ మేరకు మద్యం అమ్మకాలు చేయాలి. ఆ తరువాత దుకాణాలను మూసివేయాలి. దీంతో ఆ ప్రకారం అమ్మకాల టార్గెట్ పూర్తయి ముందుగానే దుకాణాలను మూసేస్తున్నారు. దీంతో మందుబాబులు తలపట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరిమితులతోనే మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. బార్లలో మాత్రం ఈ నిబంధనలు ఇంకా అమల్లోకి రాకపోయినా కొద్ది రోజుల్లో అమలవుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే పరిమితులతో అమ్మకాలు సాగించి., మద్యం దుకాణాలు మూసివేస్తుండటంతో మందుబాబులకు ఇబ్బందులు తప్పవని ఎక్సైజ్ అధికారులు గుర్తించి విక్రయాలను మరో 20 శాతం పెంచేలా చర్యలు చేపడుతున్నారు.

విచ్చల విడిగా బెల్టు షాపులు

మద్యం అమ్మకాలపై అధికారులు నిబంధనలు విధించడంతో మందు బాబులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో బ్లాక్‌లో మద్యం కోసేందుకు. బార్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన పలువురు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ముందుగానే మందను కొనుగోలు చేసి దుకాణాలు మూసివేశాక బెల్టు దుకాణాలకు పక్కనే కూల్ డ్రింక్స్ దుకాణాల వ్యాపారులు బెల్టు దుకాణాలుగా మార్చుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. స్థానిక పోలీసులు, సెబ్ అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో మునుగుతూ వాటి వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.



పరిమితులు మించరాదు

మద్యం అమ్మకాల్లో పరిమితులు మించరాదనే నిబంధనలు ఉన్నాయి. పరిమితులకు మించి అమ్మితే ఆయా ప్రాంతాల్లో జాతర, లేక వేడుకలు ఉంటే ఆ విషయాన్ని చూపాల్సి ఉంటుంది. గత ఏడాది అమ్మకాల ఆధారంగానే అమ్మకాలు చేయాల్సి ఉంది. ఈ మేరకు అమ్మకాలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల ప్రభావం మద్యంపై ఉండ కూడదనే నిబంధన కిందికి అమ్మకాలు వస్తాయి. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం ఉండ కూడదనే ఎన్నికల కమిషన్ నిబంధన తెరపైకి తెచ్చింది.

-సుధీర్‌బాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్



ఇటీవల సీజ్ చేసిన మద్యం బాటిళ్లను చూపుతున్న సెబ్ అధికారులు

విచ్చల విడిగా పక్క రాష్ట్రాల మద్యం..

జిల్లాలోకి పక్క రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మద్యం అక్రమంగా జిల్లాలోకి చేరుతోంది. ఇటీవల తెలంగాణ రాష్ట్రం నుంచి రూ. 14.50 లక్షల మద్యం స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరో అధికారుల తనిఖీల్లో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో జిల్లాలోని ఇతర రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో నిత్యం పక్క రాష్ట్రాల మద్యం పట్టు బడం ఇందుకు బలం చేకూరుస్తోంది. బెల్టు షాపుల దందా జోరుగా సాగుతుండటంతో ఉన్నతాధికారులు సైతం నివ్వెరపోతున్నారు. ఎన్నడూలేని విధంగా బెల్టు షాపులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉండటంతో వాటిని నిర్మూలించాల్సిన పోలీసు, సెబ్ మామూళ్లతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.



ఆమె మరణించినా నలుగురికి ప్రాణదానం

- ప్రొద్దుటూరు మహిళ బ్రెయిన్ డెడ్
- అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులు
- గ్రీన్ చానల్ ద్వారా గుండె, లివర్ తిరుపతికి తరలింపు



కృష్ణవేణి(ఫైల్)

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 13: ఆమె మరణించినా మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపింది. అవయవదానంతో ఆ నలుగురికి ప్రాణం పోసింది. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దొంతు కృష్ణవేణి (38)కి ఫిట్స్ రావడంతో ఆమె భర్త రామభద్రయ్య గురువారం కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. రోగిని పరిశీలించిన వైద్యులు తలలో రక్తం గడ్డ కట్టినట్టు గుర్తించారు. శనివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయింది. అవయవ దానంపై కోఆర్డినేటర్లు మృతురాలి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం భర్త కుటుంబ సభ్యులు అంగీకరించడంతో రెండు కిడ్నీలు, లివర్, గుండెలను దానం చేశారు. చనిపోతూ కూడా మరో నలుగురికి ప్రాణదానం చేయడం తమకు గర్వంగా ఉందని కృష్ణవేణి భర్త రామభద్రయ్య పేర్కొన్నారు.

గ్రీన్ చానల్ ద్వారా తరలింపు: బ్రెయిన్ డెడ్ అయిన కృష్ణవేణి లివర్, గుండెను పోలీసులు గ్రీన్ చానల్ ద్వారా తరలించారు. గుండెను పద్మావతి మెడికల్ కాలేజీకి, లివర్‌ను స్విమ్స్‌కు విమానం ద్వారా తరలించారు. అదేవిధంగా రెండు కిడ్నీలలో ఒకటి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి, మరొకటి కర్నూలు కిమ్స్‌కు అందించారు. జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాంబాబు ఆధ్వర్యంలో కర్నూలు ట్రాఫిక్ పోలీసులు విమానంలో తిరుపతికి తరలించారు.



కృష్ణవేణి భౌతికకాయానికి సెల్యూట్ చేస్తున్న కిమ్స్ సిబ్బంది



తిరుపతికి గుండె, లివర్‌ను తరలిస్తున్న సిబ్బంది



కర్నూలు జీజీహెచ్‌కి కిడ్నీని తీసుకెళ్తున్న కోఆర్డినేటర్లు

మంత్రాలయంలో భక్తుల రద్దీ



మంత్రాలయం మఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, ఏప్రిల్ 13: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు రోజులు కావడంతో రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. శని, ఆదివారం వేలాది మంది భక్తులు రావడంతో మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ఎదుటే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

పేదలపై దాష్టీకం

- ఖండేరిలో బలవంతంగా గుడిసెల తొలగింపు
- రోడ్డున పడిన కుటుంబాలు



ఎక్స్‌కవేటర్‌తో ఇళ్లను కూల్చివేయిస్తున్న సిబ్బంది

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 13: పేదలపై పోలీసులు, అధికారుల దాష్టీకం ప్రదర్శించారు. 40 సంవత్సరాలుగా కాపురం ఉంటున్న గుడిసెలను అర్ధాంతరంగా తొలగించారు. దీంతో వారంతా రోడ్డున పడ్డారు. నగరంలోని 1వ వార్డు ఖండేరి రాఘవేంద్ర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాల వెనుక భాగాన పార్కు స్థలం ఉంది. అందులో సుమారు 40 ఏళ్లుగా ఐదు సెంట్ల స్థలంలో పేదలు గుడిసెలు, ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం సుమారు 100 మంది పోలీసులు, 50 మంది నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది వచ్చి ఎక్స్‌కవేటర్ల సహాయంతో ఇళ్లను తొలగించారు. అక్కడ ఉన్న చర్చిని సైతం కూకటివేళ్లతో పెకిలించారు. దీంతో స్థానికులు చిన్న పిల్లలను బయటికి తీసుకుని రోడ్డుపైకి వచ్చారు. తమ ఇళ్లను కూల్చివేయరాదని పోలీసులు, అధికారులతో వాగ్వివాదానికి దిగారు. బాధితుల గోడును ఏ మాత్రం పట్టించుకోని రెండో పట్టణ సీఐ బాధితుల నివాసాలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

● అప్పుడేమో పట్టించుకోకుండా..

ఇక్కడ సుమారు 150 నుంచి 200 ఓట్లు ఉన్నాయి. ఈ క్రమంలో పార్కు స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న కూడా ఎవరూ పట్టించుకోలేదు. గత సంవత్సరం స్థానికులు కోర్టుతోపాటు నగర పాలక సంస్థ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారు. అయితే విషయాన్ని పరిశీలించిన కోర్టు కమిషనర్ తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే బాధితుల తరపున న్యాయవాదులు కోర్టులో స్టే కూడా తీసుకువచ్చారు.



ఇంటి గోడను కూల్చి వేసిన దృశ్యం

కమిషనర్ ఆదేశాల మేరకే చేశాం

నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు గుడిసెలు, ఇళ్లను తొలగించాం. గతంలోనే బాధిత కుటుంబాలకు నోటీసులు జారీ చేశాం. టిడ్కో ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి. ఇతర ప్రాంతాల్లో ఇళ్లు చూసుకోవాలని హెచ్చరించాం. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. పరిస్థితి విషమించడంతో తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది.

-మంజుల, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్, పట్టణ ప్రణాళిక విభాగం



పోలీసుల పహరాలో ఇళ్లను కూల్చుతున్న దృశ్యం

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

- టీడీపీ జిల్లా లీగల్ సెల్‌అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్
- టీడీపీ కార్యాలయంలో లీగల్ సెల్ సదస్సు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 13: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేద్దామని టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన న్యాయవాదుల సదస్సులో టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్, బీజేపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు నర్సింహులు, జనసేన లీగల్ సెల్ అధ్యక్షుడు పీవీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జోన్ 5 ఇన్‌చార్జి బీద రవిచంద్రయాదవ్, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆకెపోగు ప్రభాకర్ హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేఈ జగదీష్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, మిత్ర పక్ష పార్టీల అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా న్యాయవాదులం పని చేస్తామని అన్నారు. ప్రతి అభ్యర్థి ఎంతో జాగ్రత్తగా ఎన్నికలను ఎదుర్కోవాలని, న్యాయవాదుల సలహా మేరకు నామినేషన్లు మొదలుకొని, కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. నామినేషన్ నుంచి బ్యాంక్ అకౌంట్ తెరవాలని, ఖర్చులకు సంబంధించి ఈ అకౌంట్ నుంచే డ్రా చేయాల్సి ఉంటుందని తెలిపారు. అది కూడా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు మాత్రమే ఖర్చు చేయాలని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీటీ నాయుడు

అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలి

బీటీ నాయుడు, బీద రవిచంద్రయాదవ్, భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశానుసారంగా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపొంది మరోసారి ముఖ్యమంత్రి కావాలని జగన్మోహన్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలకు పూనుకుంటున్నారని ఆరోపించారు. ప్రతి పక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై ప్రతి చిన్న విషయంలో కేసులు పెట్టించి అడ్డు తొలగించుకోవాలనే కుటిలత్వంతో ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారుల ద్వారా ప్రతి పక్ష పార్టీ అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరణ చేయించి ఏకగ్రీవాలు చేసుకున్న విషయం విస్మరించవద్దని సూచించారు. అభ్యర్థులు ప్రచారం సందర్భంగా కూడా న్యాయవాదులను వెంట బెట్టుకోవాలని, ఎక్కడైనా పోలీసు కేసులు నమోదు చేస్తే వెంటనే తగిన న్యాయ సహాయాన్ని పొందే విలు ఉంటుందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి భూ వివాద చట్టం 2022 గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించే వీలు కూడా ఉంటుదని తెలిపారు. ప్రతి ఒక్క అభ్యర్థి ఒకటికి రెండు సార్లు నామినేషన్ పత్రాలను సరి చూసుకోవాలని సూచించారు. ఈ సదస్సుకు హాజరైన న్యాయవాదులు ఎన్నికల ప్రక్రియ సందర్భంగా అనుసరించ వలసిన అంశాలపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాశెట్టి శ్రీనివాసులు, చంద్రశేఖర్, సురేష్, వై.మల్లికార్జున నాగభూషన్ నాయుడు, మాదన్న, మోహన్‌రావు రవికాంత్, రషీద్, ఎస్‌ఏ సుభాన్ పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలో రూ.20 లక్షలు స్వాధీనం


నగదు స్వాధీనం చేసుకున్న సీఐ

పాణ్యం, ఏప్రిల్ 13: మండలంలోని తమ్మరాజుపల్లె పోలీసు చెక్‌పోస్టు వద్ద శనివారం జరిపిన వాహనాల తనిఖీలో రూ.20 లక్షలను పాణ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నల్లప్ప మాట్లాడుతూ కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఏపీ39ఎంయు6767 నెంబరు గల కారును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న కర్నూలు నగరం గౌతమీ నగర్‌కుచెందిన కల్లూరు రంగారెడ్డి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.20 లక్షలు నగదును గుర్తించినట్లు తెలిపారు. పెద్దమనుషుల సమక్షంలో పంచనామా చేసి నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అశోక్, బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణవేణి మహిళ అవయవాల దానం


ఓర్వకల్లు విమానాశ్రయంలోకి బాక్సుల్లో తరలిస్తున్న అవయవాలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 13: కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బిందు కృష్ణవేణి అనే మహిళ బ్రెయిన్‌కు సంబంధించి కొన్ని రోజుల క్రితం కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. చికిత్స పొందుతూ కృష్ణవేణి బ్రెయిన్ డెడ్ అయ్యారు. శనివారం కృష్ణవేణి అవయవాలను ఆమె భర్త అనుమతితో వైద్యులు సేకరించారు. కృష్ణవేణి హార్ట్, లివర్‌ను ప్రత్యేక అంబులెన్సులో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతిలోని పద్మావతి ఆసుపత్రికి తరలించారు. కిడ్నీని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్సుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అవయవాలను బాక్సుల్లో భద్రపరిచి వైద్యుల ఆధ్వర్యంలో తరలించారు. ఓర్వకల్లు ఎస్‌ఐ రాజారెడ్డి విమానాశ్రయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎట్టకేలకు కొండముచ్చుల పట్టివేత


పట్టుబడిన రెండు కొండముచ్చులు

డోన్(రూరల్), ఏప్రిల్ 13: డోన్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఐదు రోజులుగా ప్రజలపై దాడి చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్న రెండు కొండముచ్చులను అటవీశాఖ అధికారులు బంధించారు. డీఎఫ్‌ఓ శివశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సూర్యచంద్రరాజు, డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం కొండముచ్చుల కోసం గాలింపు చర్యలు చేపట్టింది. దీంతో శనివారం ఉదయం రెండు కొండముచ్చులను అటవీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం వాటికి వైద్యచికిత్సలు చేయించారు. ఆత్మకూరు అటవీ ప్రాంతంలో కొండముచ్చులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శివశంకర్, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బేతంచెర్ల, ఏప్రిల్ 13: చికిత్స పొందుతూ శనివారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. జమ్మలమడుగుకు చెందిన గోకారి (70)శుక్రవారం గుంటూరు నుంచి కాచిగూడ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్నాడు. కృష్ణమ్మ కోన రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. నంద్యాల రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో జేఎల్‌ఎం దుర్మరణం

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 13: మండలంలోని పులకుర్తి జేఎల్‌ఎం మహేష్‌ఆచారి (27) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మహేష్ శనివారం మధ్యాహ్నం ఓ పొలంలో ట్రాన్స్‌ఫార్మ్ వద్ద హెచ్‌జీ (హార్న్ గ్యాప్) ఫీజు వేయడానికి వెళ్లాడు. అందుకు లైన్ ఆఫ్ చేయించాడు. పని చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి పనులకు పూనుకోగా షాక్ గురై ఒక్కసారిగా కింద కింద పడ్డాడు. నిర్ఘాంతపోయిన పొలం రైతు ఇతరుల సాయంతో బైక్‌పై ఆసుపత్రికి తరలించాడు. మార్గమధ్యంలో 108 వాహనం రాగా అందులో తరలించారు. బాధితుడిని గూడూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విద్యుదాఘాతానికి గురయ్యాడా లేదా అనేది తెలుస్తుందని ఏఈ ఇస్మాయిల్ తెలిపారు. నెల రోజుల క్రితమే మహేష్ తండ్రి మల్లికార్జున కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. అంతలోనే పెద్దదిక్కుగా ఉన్న ఒక్కగానొక్క కుమా రుడు మహేష్ కూడా మృతి చెందడంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. మృతునికి తల్లి శకుంతలమ్మ, భార్య రాధిక, ఏడాదిన్నర పాప ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 13: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు పేద, మధ్యతరగతి జీవితాల్లో వెలుగులు నింపుతాయని కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామంలో శనివారం కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి ఎంపీ అభ్యర్థి నాగరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. అంతేగాకుండా ప్రతి రైతుకు ఏడాదికి పెట్టుబడి ఖర్చు కింద రూ.20వేల ఆర్థిక సహాయం అందించే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ విధ్వంస పాలనను అంతమొందించాలని ఆయన కోరారు. పారిశ్రామికంగా ఏపీ పూర్తిగా వెనకబడిందని, చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేక పక్క రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకరావడంలో జగన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని నాగరాజు విమర్శించారు. రాష్ట్రంలో సర్పంచుల నిధులను సైతం నొక్కేసిన వైసీపీని ఇంటిని సాగనంపాలని, గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీకి ఒక్కసారి ఓటు వేసి అన్ని విధాలుగా తీవ్రంగా నష్టపోయారని, మరోసారి ఆ పొరపాటు చేయవద్దన్నారు. రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు వేసి తనతోపాటు కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు మాధవి, గ్రామ నాయకులు బీజేపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు

వైసీపీ జెండాలు, టీషర్టులు స్వాధీనం

వాహనం సీజ్


స్వాధీనం చేసుకున్న అనుమతి లేని వాహనం

ఆలూరు, ఏప్రిల్ 13: ఆలూరు-ఆదోని రోడ్డు సమీపంలోని బెల్లిగుండు ఆంజనేయ స్వామి క్రాస్ వద్ద అనుమతి లేకుండా వైసీపీ జెండాలు, బ్యాడ్జీలు, కండువాలు, కరపత్రాలు, స్టిక్కర్స్ బ్యాగ్‌లు, టీషర్టులను శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ అధికారుల ఉత్తర్వుల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం డిప్యూటీ తహసీల్దార్, బీ బ్రహ్మయ్య, ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు సిబ్బంది కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ 39ఎంబీ, 6819 నెంబర్ గల కారులో లభించాయి. కారును సీజ్ చేసిన అధికారులు, కారు ఓనర్ గుర్నాథరెడ్డి, డ్రైవర్ బొంటుపల్లి సురేష్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలు పాటించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దేవనకొండ, ఏప్రిల్ 13: చికిత్స పొందుతూ శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. మండలంలోని కె.వెంకటాపురానికి చెందిన గొల్ల మోహన్ (27 కొత్తపేట గ్రామానికి చెందిన సుజాతను నాలుగేళ్ల కిందట పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లో లిఫ్ట్‌లో పని చేస్తూ భార్యా భర్తలిద్దరూ జీవనం సాగించేవారు. వారం రోజుల కిందట కొత్తపేటకు వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం మోహన్ పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి తిమ్మప్ప ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు. భార్య సుజాత ప్రస్తుతం గర్భిణికాగా వీరికి మూడేళ్లలోపు చిన్నారులు ఇద్దరు ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు
రాష్ట్రానికే శ్రీరామరక్ష

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత


ఎన్నికల ప్రచారంలో విజయ కేతనం చూపుతున్న టీడీపీ పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నా యుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు రాష్ట్రానికే శ్రీరామరక్షగా నిలు స్తాయని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు మండలం పెద్ద కొట్టాల, చిన్న కొట్టాల, రేమడూరు, పుసులూరు, బొల్లవరం గ్రామాల్లో పర్యటించారు. ఉమ్మడి మేని ఫెస్టోలోని బాబు షూరిటీ - భవిషత్తు గ్యారెంటీ, సూపర్-6 పథకాలను గౌరు చరిత ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నిక ల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభంజనం సృష్టిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో చిన్న కొట్టాల గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు సోమన్న, దుబ్బన్న, గోవిందులతోపాటూ 50 కుటుంబాలు గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజినేయులు, మాజీ ఎంపీపీ వాకటి మాధవి, మదేశ్, తడకనపల్లె సర్పంచ్ సహరబీ, పాణ్యం టీడీపీ అధ్యక్షుడు జవాజి గంగాధర్ గౌడ్, పెద్ద కొట్టాల మురళీరెడ్డి, రంగారెడ్డి, ఖాసిం, అక్బర్ బాషా, రేమడూరు రామనాయుడు, పుల్లన్న, బజారన్న, బొల్లారం మస్తాన్ నాయుడు, విజయ్, పుసులూరు కృష్ణ, రాముడు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌గౌడ్, బీజేపీ నాయకుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

13 రోజుల తర్వాత శవం వెలికితీత

- బీమా సొమ్ము కోసం ఫారూక్ డ్రామా అని అనుమానాలు
- వ్యక్తి అదృశ్యం.. అగ్ని ప్రమాదం కేసులపై పోలీసుల విచారణ
- శెట్టి ప్రతాప్ మృతదేహం బంధువులకు అప్పగింత

పాములపాడు, ఏప్రిల్ 13: మిస్టరీగా మారిన ఓ ఘటనకు సంబంధించి పాములపాడు పోలీసులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. హత్య చేసి ప్రమాదవశాత్తు జరిగినట్లుగా చిత్రీకరించిన ఓ కేసుకు సంబంధించి పోలీసులు వేగవంతమైన విచారణ చేపడుతున్నారు. అందులో భాగంగానే శనివారం పాములపాడులోని ఖబరస్థాన్‌లో ఇటీవల ఖననం జరిగిన మృతదేహానికి 13 రోజుల తర్వాత పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మొదటి నుంచి ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకెళితే... ఈ నెల ఒకటో తేదీన పాములపాడులోని ఫారూక్ ట్రేడర్స్ యజమాని ఫారూక్‌బాషా షాపులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీంతో ఫారూక్ బాషా కుమారుడు అక్బర్‌బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అక్కడ దొరికిన ఆనవాళ్ల ప్రకారం దుకాణ యజమాని ఫారూక్ బాషాగా కుటుంబ సభ్యులు గుర్తించి ముస్లిం సంప్రదాయ రీతిలో ఖననం చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అయితే అదే రోజు మండలంలోని చెలిమిల్లకు చెందిన శెట్టి ప్రతాప్ కనిపించడం లేదంటూ భార్య స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సవాల్‌గా తీసుకుని విచారణ వేగవంతం చేశారు. తాగుడుకు బానిసైన శెట్టి ప్రతాప్ డబ్బుల కోసం ఫారూక్ దుకాణంలో పనిచేసేవాడని సమాచారం. ప్రమాదవశాత్తు ఫారూక్ అనే వ్యక్తి మంటల్లో కాలిపోయి గుర్తు పట్టనంత విధంగా ఉండటం, ప్రతాప్ కనిపించకకుండా పోవడంతో పోలీసులకు అనుమానం వచ్చి అన్ని కోణాల్లో విచారణ చేశారు. నిజానికి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారి ఫారూక్ బాషా అప్పుల్లో కూరుకుపోయాడు. తాను చనిపోయినట్లు జనాలను నమ్మిస్తే... అప్పులు మాఫీ కావడంతో పాటు తనపై ఉన్న బీమా డబ్బులు కుటుంబ సభ్యులకు వస్తాయని భావించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అగ్ని ప్రమాదంలో తాను మృతి చెందినట్లుగా ఓ నాటకానికి తెరలేపాడు. చివరకు శెట్టి ప్రతాప్ అదృశ్యం కేసు, అగ్ని ప్రమాదం కేసులు ఒకే రోజు నమోదు కావడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. విచారణ చేపట్టగా చివరకు మృతి చెందింది ఫారూక్ బాషా కాదని, శెట్టి ప్రతాప్‌ది అని తేలింది. బతికే ఉన్నా చనిపోయినట్లు ఆడిన ఫారూక్ డ్రామా ఎట్టకేలకు బయటపడింది.


మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ఆ మృతదేహం శెట్టి ప్రతాప్‌దే...

శెట్టి ప్రతాప్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తుండగా అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఎవరన్న దానిపై ఆరా తీశారు. ఆ శవంపై ఉన్న దుస్తుల ఆధారంగా శెట్టి ప్రతాప్ కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో శనివారం నంద్యాల ఏఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ, శ్రీనివాసరావు, సీఐ నాగభూషణం ఎస్‌ఐలు, తహసీల్దార్ పఠాన్ బాబు, ఆధ్వర్యంలో ఖబరస్థాన్‌లోని మృతదేహాన్ని వెలికి తీయించి శెట్టి ప్రతాప్ తల్లిదండ్రులు, భార్యకు అప్పగించారు.

పరారీలో ఫారూక్ బాషా

అగ్ని ప్రమాదం జరిగినప్పటి నుంచి ఫారూక్ బాషా పరారీలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతడిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. శెట్టి ప్రతాప్‌పై పెట్రోల్ పోసి ఫారూక్ బాషా హత్య చేశాడని స్థానిక రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

మాధవుడి సేవలో కోట్ల



కోట్లను ఆశీర్వదిస్తున్న అర్చకులు

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 13: గోరంట్ల లక్ష్మీమాధవస్వామిని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా కోట్ల లక్ష్మీమాధవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు తిరుమల నాయుడు, పరమేశ్వర నాయుడు, బెలగల్ ఆదిత్య రెడ్డి, ఆంధ్రయ్య, డీలర్ ప్రకాష్‌రెడ్డి, వర్కూరు చాకలి చెన్నప్ప, క్రిష్ణాపురం అంజన్‌రెడ్డి ఉన్నారు.

ఒక్క రోజే రూ.25.54 లక్షల పన్ను వసూలు



కౌంటర్ వద్ద పన్ను చెల్లించేందుకు క్యూలో నిల్చున్న ప్రజలు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 13: నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను ద్వారా ఒక్కరోజే రూ.25.54 లక్షల ఆదాయం వచ్చింది. ఆస్తి పన్నుపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30 వరకు 5 శాతం రాయితీ ఇవ్వడంతో ప్రజలు పెద్ద ఎత్తున పన్నులు చెల్లిస్తున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సెలవు రోజుల్లో కూడా పన్ను వసూళ్లకు కౌంటర్ తెరచి ఉంచారు. ఈ అవకాశం ఈ నెలాఖరు వరకు ఉండటంతో ప్రజలు పెద్ద ఎత్తున ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. దీంతో పాటు కొళాయి పన్ను రూ.2.87 చెల్లించారు. ఆర్‌ఓ జునైద్ మేనేజర్ చిన్నరాముడు, పర్యవేక్షణలో సిబ్బంది మల్లికార్జున, రమేష్‌బాబు, రాజేష్, కంప్యూటర్ ఆపరేటర్ షాషా కౌంటర్‌లో విధులు నిర్వహించారు.

బీసీలే టీడీపీకి వెన్నముక

ఓర్వకల్లు, ఏప్రిల్ 13: బడుగు, బలహీన వర్గాల ప్రజలే తెలుగుదేశం పార్టీకి వెన్నముక అని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నన్నూరులోల జయహో బీసీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి టీడీపీ ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందని, 50 ఏళ్లకే రూ.4వేలు పింఛన్ అందజేస్తుందని అన్నారు. బీసీలపై వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలులో పంపాడమే కాకుండా, వారిని ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, విజయుడు, ఖాజామియా, తిరుపాలు, ప్రకాశం, శివుడు, సర్కార్, వెంక టస్వామి, శ్రీరాములు, ప్రతాప్, మద్దిలేటి, సుబ్బారెడ్డి, వెంకట్రాముడు, షఫీవుల్లా, మండలంలోని కేతవరం, పూడిచెర్ల, నన్నూరు గ్రామాల బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16న 'కందుకూరి' పురస్కారాల ప్రదానం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 13: ఈనెల 16న 'తెలుగు నాటక రంగ దినోత్సవం' సందర్భంగా ఎంపిక చేసిన 14 మంది రంగస్థల కళాకారులకు 'కందుకూరి' పురస్కారాల ప్రదానంతోపాటూ ఘనంగా సత్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకట నలో తెలిపారు. తెలుగుభాషలో తొలి నాటకం రాసిన సంఘ సంస్కర్త కందు కూరి వీరేశలింగం పంతులు స్ఫూర్తితో ఈ పురస్కారాలు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 16న సా యంత్రం 6.30 గంటలకు ఉంటుందని, అంతకు ముందు తెలుగు నాటకరంగ దినోత్సవ వేడుకలు, 'శ్రీకృష్ణ రాయబారం' నాటకంలోని పడక సీను ప్రదర్శన ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

ఆబ్యాకస్‌లో రవీంద్ర విద్యార్థుల ప్రతిభ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 13: ఆబ్యాకస్‌లో రవీంద్ర విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య తెలిపారు. స్థానిక మాధవి నగర్‌లో రవీంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాల, రెవెన్యూ కాలనీలో రవీంద్ర టాలెంట్ పాఠశాలలో టీఎల్ఎస్ ఆబ్యాకస్-వేదిక మ్యాథ్స్ ఫైనల్ డే సెలబ్రేషన్స్ ఆ సంస్థ రిసోర్స్ పర్సన్ అరుణ్ కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మేథోశక్తి పెంచడానికి స్కిల్స్, అభివృద్ధికి కాన్సంట్రే షన్ లిజనింగ్ స్కిల్స్, ఫోటోగ్రఫీ, వేగంగా కాలిక్యులేషన్, ఆర్థమెటిక్, రీజనింగ్ స్కిల్స్‌పై పట్టు సాధించేందుకు ఆబ్యాస్ ఉపయోగపడుతుందన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ ప్రశంసాపత్రాలను అందజేసి అభి నందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శారద, కోఆర్డినేటర్లు అక్తర్‌బేగం, సౌజన్య, బాలు, సుభద్ర, నాగేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

సి.బెళగల్, ఏప్రిల్ 13: మండల కేంద్రం, బురాన్‌దొడ్డి, పోలకల్లు, కొండాపురం గ్రామాల్లో అంబేడ్కర్ జయంతికి మండల ఎంఆర్‌పీఎస్ నాయ కులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు అలంకరణ, రంగులు వేశారు. ఈసందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగ రాజు, బుడ్డన్న, నాగరత్నం మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతికి ఎమ్మార్పీఎస్ నాయకులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఉచిత స్విమ్మింగ్ శిక్షణ

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 13: ప్రతిఒక్కరూ ఉచిత స్విమ్మింగ్ శిక్షణను వినియోగించుకోవాలని నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈఏడాది వేసవి సెలవుల్లో చిన్నపిల్లలకు, పెద్ద లకు ఉచితంగా స్విమ్మింగ్ (ఈత) నేర్పిస్తామని, ఈ శిక్షణ నందికొట్కూరు రోడ్డులోని వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం సమీపాన సహస్ర ఇన్‌ఫ్రా వారి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్పించనున్నట్లు ఆయన వివరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి

ఓర్వకల్లు, ఏప్రిల్ 13: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సోదరుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కన్నమడకల గ్రామంలో టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రావు, బొల్లవరం వెంకటేశ్వర్లు, శివకుమార్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రాబోయేది కూటమి ప్రభుత్వమే

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 13: రెండు నెలల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం వచ్చేది ఖాయమని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని 16వ వార్డు బుధవారపేటలో తెలుగు యువత రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి లక్కీటూ గోపినాథ్ ఆధ్వర్యంలో వైసీపీ యువనాయకుడు విక్రమ్, అజయ్ బృందం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే యువత భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పామన్న, అబ్బాస్, రామాంజనేయులు, పోతురాజు రవికుమార్, ధరూర్ జేమ్స్, నరేన్, జనసేన కర్నూలు ఇన్‌చార్జి హర్షద్, రాయలసీమ ఎన్నికల కన్వీనర్ పవన్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేష్ పాల్గొన్నారు.

మంచి చేసే వారిని ప్రోత్సహించండి: సమాజంలో మంచి పనులు చేసే వారిని పోత్సహించాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని కుమ్మరి వీదిలో ఉన్న షిరిడీ సాయి బాబా సమ్మేత శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయం 16వ వార్షికోత్సం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి టీజీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ దత్తాత్రేయ సాయి ఆలయంలో 16 సంవత్సరాలుగా అధ్యాత్మిక



భక్తులకు అన్నం వడ్డిస్తున్న టీజీ భరత్, బస్తిపాటి నాగరాజు



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయ ప్రతినిధులు టీజీ భరత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పాల్గొని టీజీ భరత్‌తో కలిసి భక్తులకు భోజనం వడ్డించారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు ఊట్ల రమేష్, చెన్నారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

14వ వార్డులో టీజీ భరత్ భరోసా యాత్ర : నగరంలోని 14వ వార్డు బుధవారపేటలో కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ భరోసా యాత్ర శనివారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని కలిసి తన ఆరు గ్యారంటీల కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ఒక్క చేత్తో డబ్బులు ఇస్తూనే.. నిత్యావసర సరుకుల ధరలు, పన్నులు పెంచి మరో చెత్తో డబ్బులు మొత్తం లాగేసుకుంటున్నారని మండిపడ్డారు. కర్నూలు నగరంలోని ఏ వీధికి వెళ్లినా సమస్యలు తప్ప.. అభివృద్ధి కనిపించడం లేదన్నారు. వార్డు పర్యటనకు వచ్చిన టీజీ భరత్‌కు మహిళలు, వృద్ధులు, యువకులు సమస్యలను మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జాకీయా అక్సారీ, మాజీ కార్పొరేటర్లు అబ్బాస్, రామాజంనేయులు, జనసేన రాష్ట్ర ఉమెన్ ఎంపర్‌మెంట్ చైర్మన్ రేఖా, పవన్, టీడీపీ యువ నాయకులు కరిముల్లా, రియాజ్, షేక్, మహబూబ్, శ్యామ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 13: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక హైస్కూల్‌లో శనివారం రాత్రి సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. వేలాది మంది భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. ప్రవచన కర్త, టీటీడీ వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవాచార్య ముఖ్య వక్తగా మాట్లాడుతూ సీతారాముల కల్యాణ వేడుక విశిష్టతను వివరించారు. సమాజంలో దంపతుల మధ్య జీవనం ఎలా ఉండాలో సీతారాములు చాటి చెప్పారని పలు ఉదాహారణలతో వివరించారు. కల్యాణోత్సవంలో రాగమయూరి బిల్డర్స్ అధినేత కేజే రెడ్డి, సిద్ధార్థరెడ్డి, వాసుదేవయ్య, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో చిన్నారుల శాస్త్రీయ కూచిపూడి నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కర్నూలు సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు కె. క్రిష్ణన్న, ఎం. నాగోజీరావు, కోశాధికారి కల్కి మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు ఎస్‌వీ



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణరెడ్డి, ఎస్ మహాబలేష్, సంయుక్త కార్యదర్శులు సగరం నటేష్ కుమార్, జే గోపీనా థరావు, ఎన్ మల్లికార్జున, కే అచ్చి, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు టీసీ మద్దిలేటి కల్యాణోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ వేడుకలకు కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

బాధిత రైతుకు పరామర్శ



బాధిత రైతును పరామర్శిస్తున్న టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 13: మండలంలోని వర్కూరులో అగ్నిప్రమాదం బారిన పడిన రైతు రామక్రిష్ణను టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం పరామర్శించారు. శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివామి దగ్ధమైన సంగతి తెలిసిందే. విష్ణువర్ధన్‌రెడ్డి ప్రమాద ఘటనపై ఆరా తీశారు. జరిగిని నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. దీంతో పశుగ్రాసం కాలిపోవడంతో దిక్కుతోచడం లేదని రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. విష్ణువర్ధన్‌రెడ్డి వెంటనే రూ.15వేలు విలువైన ట్రాక్టర్ వరిగడ్డి సాయం చేయడంతో రైతు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమలో పార్లమెంటు ఉపాధ్యక్షుడు కేఈ మల్లిఖార్జునగౌడ్, తాండ్రపాడు సర్పంచ్ ఆకెపోగు జయన్న, స్థానిక నాయకులు జీపు క్రిష్ణ, మద్దూరు హనుమంతు, జే రాముడు, ప్రతాప్,రామాంజనేయులు, నాగరాజు, జయన్న, రామచంద్రుడు, గడ్డమయ్య, సోమప్ప పాల్గొన్నారు.

ధర్మం వైపు నిలబడండి: రాబోవు ఎన్నికలు ధర్మం, అధర్మానికి మధ్య పోరు అని టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పులకుర్తి గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్ర భవిష్యత్తును ఆగమ్యగోచరంగా మార్చిన జగన్ చరిత్ర హీనుడుగా మిగిలి పోతాడని విమర్శించారు. కార్యక్రమంలో త్రివేద్, సురేంద్ర, నాగేష్, తిప్పన్న, లక్ష్మన్న, రంగన్నగౌడ్, గోపాల్, రమణయ్య, ఈరస్వామి, చిన్నరాముడు, రాము, లక్ష్మన్న, శివ, విజయ్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



పంచలింగాలలో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి, నాగరాజు

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామంలో కర్నూలు పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుతో కలిసి బొగ్గుల దస్తగిరి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలో రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి దస్తగిరి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు మాధవి, ఉపసర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు కృష్ణ, ముద్దప్ప, క్రిష్ణారెడ్డి, మద్దిలేటి, అబ్దుల్లా, రాముడు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకుడు డాక్టర్ శ్రీనివాసమూర్తి

గూడూరు, ఏప్రిల్ 13: టీడీపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ పరిశీలకుడు డాక్టర్ శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. శనివారం టీడీపీ పరిశీలకుడు డాక్టర్ శ్రీనివాసమూర్తి, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి కలసి గూడూరులో టీడీపీ కార్యాలయాన్ని సందర్శించి నాయకులతో మాట్లాడారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు, జిల్లా మైనార్టీ నాయకుడు డాక్టర్ మన్నన్ బాషా, బీసీ సెల్ నాయకుడు నాగప్ప యాదవ్, కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, పౌలు, తెలుగు శ్రీను, విజయ్ కుమార్, కళ్యాణ్ రఘు పాల్గొన్నారు.

మేటీ క్రీడాకారులుగా రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న క్రీడా ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 13: అందివచ్చిన అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని మేటీ క్రీడాకారులుగా రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జాతీయ యోగా సంఘం సంయుక్త కార్యదర్శి న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా మాడ్రన్ పెంటాతలన్ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి లేజర్ రన్ ఎంపిక పోటీ లను నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో భూపతిరావు మాట్లాడుతూ గతేడాది గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారుడు వెంకటేశ్, మోడ్రన్ పెంటాతలన్ విభాగంలో పాల్గొని పతకం సాధించారన్నారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా తరపున ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 21 వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరగబోయే 8వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం మోడ్రన్ పెంటాతలన్ కార్యదర్శి అవినాశ్, డీఎస్ఏ శిక్షకులు మహేశ్వరరావు, కాశీరావు, చంద్రశేఖర్, రవి, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి మునిస్వామి పాల్గొన్నారు.

బాలింతల్లో ఆరోగ్య సమస్యలు



గర్భిణికి ఎంసీహెచ్ కార్డు గురించి వివరిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 13: బాలింతలు, గర్భిణుల్లో రోగ నిరోధక శక్తి తగ్గినప్పుడు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శనివారం కల్లూరు మండల పరిధిలోని బొల్లవరం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో జరుగుతున్న ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఆమెకు పరీక్షలు నిర్వహించి మాతాశిశు సంరక్షణ కార్డు అందజేయాలన్నారు. ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు త్వరగా గర్భిణులను నమోదు చేసి బీపీ, మధుమేహం, రక్తహీనత పరీక్షలు చేయించాలన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కోడుమూరు, ఏప్రిల్ 13: సుంకేసుల చెక్‌పోస్టు దగ్గర అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యం సీసాలను శనివారం పోలీసులు పట్టుకొన్నారు. కోడుమూరు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సీఐ మన్సురుద్దీన్ వివరాలను వెల్లడించారు. సెబ్ పోలీసులతో కలిసి తాము నిర్వహించిన వాహనాలను తనిఖీ చేపట్టామ న్నారు. సుంకేసుల చెక్ పోస్టు దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన తిప్పన్న, రాఘవేంద్రలు మోటర్ బైక్‌పై సుమారు 144 క్వాటర్ మద్యం సీసాలను తీసుకెళ్తుండగా వాళ్లను అనుమానించి వెంబడించి పట్టుకుని, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ దాదాపు రూ.25వేలు ఉంటుందని అన్నారు. అలాగే గోరంట్ల గ్రామంలో ఎస్ఐ బాలనరసింహులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో గోరంట్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య దగ్గర ఉన్న అక్రమంగా నిల్వ ఉన్న 40 ఏపీ మద్యం సీసాలను పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.6వేలు ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాం డ్‌కు తరలిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సెబ్ సీఐ మల్లిక, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు బాలనరసింహులు, హనుమంతు, తిమ్మారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కోడుమూరు సీఐ మన్సురుద్దీన్

గ్రామాల్లో పోలీసుల కవాతు



కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, ఏప్రిల్ 13: కె.నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంచికలపాడు, కె.నాగలాపురం, బుడిదపాడు, పర్ల గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కె నాగలాపురం ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు సూచించారు. ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలన్నారు.

'రామాయణంలో సేవా ధర్మానికి ప్రత్యేక స్థానం'



ప్రవచనం చెబుతున్న బోలుగద్దె అనిల్‌కుమార్

కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 13: వాల్మీకి మహర్షి రాసిన రామా యణం మహా కావ్యంలో సేవా ధర్మానికి ప్రత్యేక స్థానం ఉంటుందని ప్రవచన కర్త బోలుగద్దె అనిల్‌కుమార్ అన్నారు. పాత నగరంలోని శ్రీరాంభొట్ల దేవాలయంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొన సాగుతున్న 'శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహం' కార్యక్రమంలో నాలుగోరోజు శనివారం 'శ్రీమద్రా మాయణం - సేవా ధర్మం' అనే అంశంపై అనిల్‌కుమార్ ప్రవచన బోధన చేశారు. తల్లిదండ్రుల సేవల్లో భాగంగా శ్రీరామచంద్రుడు రాజ్యాన్ని త్యజించారని అన్నారు. అలాగే ఏమీ ఆశించకుండా శ్రీరాముని సేవకు నోచుకున్న హనుమంతుడు, గుహుడు, శబరి, ఉడుత, నీలుడు, సుగ్రీవుడు, విభీషణుడు, వానరులు ఇలా సేవా ధర్మానికి ప్రతిరూపులుగా కనిపిస్తారని అన్నారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, కార్పొరేటర్ నగరూరు శ్రీనివా సులు, అర్చకులు గిరీశ్ శర్మ, కృష్ణకాంత్, మేడం సంజీవనాథ్ పాల్గొన్నారు.

అవయవ దాత కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 13: అవయవదాత కుటుంబాలకు ప్రభుత్వాలు రూ.10లక్షలు ప్రోత్సాహకం ప్రకటించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.సురేష్ కుమార్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. బ్రెయిన్ డెడ్ అయిన కేసుల్లో అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రోత్సాహకం ఇస్తే ఆర్థికంగా ఆ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుం దన్నారు. గత ఫిబ్రవరి నెలలో అవయవదానం చేసిన పావనీలత, శనివారం కిమ్స్ హాస్పిటల్‌లో ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి ఇద్దరు మహిళలు చిన్న వయస్సు వారని, వారి పిల్లలు ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా ప్రభుత్వం ఆదుకుంటే వారి పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీమేధ' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 13: ఇంటర్ ఫలితాల్లో నగరంలోని శ్రీమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ కె.రాము తెలిపారు. శనివారం ఇంటర్ విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంపీసీ జూనియర్ విభాగంలో అలేఖ్య (459), జగదీష్ గుప్త (445), చంద్రశేఖర్ (431), సీఈసీ విభాగంలో నవాజ్ షరీఫ్ (442), సీనియర్ ఇంటర్ ఫలితాలు ఎంపీసీ విభాగంలో ఉదయకిరణ్ (987), మధు (929), బైపీసీ విభాగంలో శ్రీనిత్య (911) మార్కులు సాధించారన్నారు.

శ్రీసాయి ప్రతిభ కళాశాల విద్యార్థులు..

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 13: ఇంటర్మీడియట్ ఫలితాల్లో పత్తికొండ శ్రీసాయి ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు రాణించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో వై.జోషిత 437/440 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో బి.స్పందన 458/470 మార్కులు, వి.శిరీష 458/470 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కే.పూజిత 965/1000 మార్కులు, స్పందన 971 మార్కులు, బైపీసీ విభాగంలో బి.లాల్ ప్రసాద్ 943 మార్కులు సాధించారు.

ఇంటర్ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న డీవీఈవో జమీర్ పాషా

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 13: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభను కనబరిచారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా వృత్తి విద్యాధికారి జమీర్ పాషా అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 209మందికి గానూ 123 మంది, ద్వితీయ సంవత్సరంలో 145 మందికి గా నూ 104 మంది విద్యార్థులు పాసై 72 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలి పారు. ఎంపీహెచ్‌డబ్ల్యూవో గ్రూపు విభాగంలో త్రిష 945/1000, సీజీటీలో షమీనా 941/1000, సీఎస్ఈలో మహేష్‌బాబు 940/1000, ఓఏలో లిఖితా రెడ్డి 913, ఎంఎల్‌టీలో ఇర్ఫాన్ 856, ఈఈటీలో జావీద్ 767, అబ్దుల్ రెహిమాన్ 748 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మలకు..

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13: ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన నిర్మలకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కొసలి అప్పారావు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో నిర్మల మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువులు అభ్యసించడానికి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, ఏప్రిల్ 13: ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిని అన్నారు. శనివారం ఎం.అగ్రహారం గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు మండిపోతున్నాయని, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు బయట తిరగరాదని సూచించారు. అతిగా శీతలపానియాలు తీసుకోవాలన్నారు. ఇంటి వద్ద లభించే నిమ్మరసం, మజ్జిగ తరుచూ తీసుకోవడం వల్ల వడదెబ్బను నివారించవచ్చన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సచివాలయ కార్యదర్శి గాయత్రి ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మద్దికెర, ఏప్రిల్ 13: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. శనివారం మండలంలోని హంపా గ్రామంలో బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, సిబ్బంది గ్రామానికి వెళ్లి బాల్యవివాహాన్ని నిలిపివేశారు. స్టేషన్‌కు పిలిపించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాల్యవివాహాలు చేస్తే కేసు నమోదు చేస్తామని నోటీసులు ఇచ్చారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే.. తమ దృష్టికి తేవాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఏఎస్ఐ ఫణిరాజు, అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, సంజమ్మ, పోలీసులు, ఉపసర్పంచు తిమ్మప్ప, తదితరులు ఉన్నారు.

కమనీయం.. వీరభద్రుడి కళ్యాణం



రథోత్సవంలో గ్రామస్థులు

తుగ్గలి, ఏప్రిల్ 13: వీరభద్రేశ్వరుని కల్యాణ రథోత్సవం కమనీయంగా నిర్వహించారు. శనివారం ఎద్దులదొడ్డిలో వీరభద్రేశ్వరస్వామి, కాళికాదేవి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య ఉత్సవమూర్తులను రథంపై పెట్టి మేళ తాళాలతో గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున గట్టి బందోబస్తు నిర్వహించారు. వైస్ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి, సర్పంచు విజయుడు, మాజీ సర్పంచు చక్రాల వీరేష్ కమిటి సభ్యులు రామాంజనేయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెల్లినే ఆదరించలేదు.. ప్రజలను ఆదరిస్తాడా?

● బీసీలు, గిరిజనులు టీడీపీతోనే

తుగ్గలి, ఏప్రిల్ 13: సొంత చెల్లినే ఆదరించలేని జగన్ .. ప్రజలను ఏమి ఆదరిస్తారని రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి అన్నారు. శనివారం మీటే తండా, బాటతండా, సూర్యతండా, ఉప్పర్లపల్లి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. పగిడిరాయిలో జయహో బీసీ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో బీటీ రోడ్లు వేశామన్నారు. ఎన్టీఆర్ తెచ్చిన పెనుమార్పుల వల్లనే ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజకీయాల్లో రాణిస్తున్నారని గుర్తుచేశారు. ఒక్క చాన్స్ అంటూ గద్దెనెక్కి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ఇక ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు వెంకటస్వామి, అప్పా వేణుగోపాల్, ఈశ్వర్ రెడ్డి, వెంకటపతి, వీరశైవలింగాయత్ కర్నూలు జిల్లా సభ్యులు కౌశిక్ కుమార్, శివరాముడు చౌదరి, చక్రపాణి, రామూ నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పీఈటీపై చర్యలు తీసుకోవాలి'

నందవరం, ఏప్రిల్ 13: స్థానిక జెడ్పీ హైస్కూల్ పీఈటీ హనీఫ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ నందవరంలో 8వ తరగతి చదువుతున్న వీరేంద్రను కటింగ్ సరిగా లేదని కొట్టడం బాధకరమన్నారు. ఇలా చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురతారన్నారు. చిన్న విషయానికి ఇలా కఠినంగా శిక్షవేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులు పీఈటీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మిగనూరు రూరల్: నందవరం జడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ ఉపాధ్యాయుడు హనీఫ్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తిక్ డిమాండ్ చేశారు. గాయపడిన విద్యార్థిని ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి

కౌతాళం, ఏప్రిల్ 13: ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని మండల విద్యాధికారి శోభారాణి అన్నారు. గురువారం స్థానిక ప్రతిభ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా, సెక్రటరీ మైనుద్దీన్, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు జయలక్ష్మి, ఈరన్న, భీమేష్ ఉన్నారు.

20 బాక్సుల కర్ణాటక మద్యం పట్టివేత

కౌతాళం, ఏప్రిల్ 13: బాపురం చెక్‌పోస్టు సమీపంలో 20 బాక్సుల కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. గోతులదొడ్డి గ్రామానికి చెందిన దుర్గయ్య, హనుమేష్, నగేష్‌తో పాటు మరో వ్యక్తి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం బాక్సులతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు నారాయణ, మద్దిలేటి, రంగన్నలు ఉన్నారు.

స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరిచిన అధికారులు

ఆలూరు, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికలు వచ్చే నెల 13న జరగనుండటంతో ఎన్నికల ఓటింగ్ యంత్రాల సామగ్రి మొత్తం శనివారం ఉదయం ఆలూరుకు ప్రత్యేక వాహనంలో చేరాయి. వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఈవీఎం బాక్స్‌లను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వాటిని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాము నాయక్, తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఓబులేసు, డీటీ గుండాల నాయక్ ప్రత్యేక గదులో ఉంచారు. ఆలూరు అసెంబ్లీలో 294 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 382 పార్లమెంట్‌కు, 382 అసెంబ్లీ ఎన్నికలకు మిషన్లు సిద్ధంగా ఉంచారు. అదనంగా మరో 20 మిషన్లు భద్రంగా ఉంచామన్నారు. ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూంల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ఆస్పరి, ఏప్రిల్ 13: మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో కాళికామాత, వీరభద్ర స్వాముల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దివంగత పుప్పాలదొడ్డి బండమీద వెంకటేశ్వర్లు సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బీ గిడ్డయ్య అన్నారు. గ్రామాల్లో అంటరానితనానికి, కుల వివక్షత నిర్మూలనకు కృషిచేసి, పేదలకు అండగా నిలిచి అమరుడైన పుప్పాలదొడ్డి బండమీద వెంకటేశ్వర్లు పేరు మీద సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌ను బలహీనపరిస్తే సహించేది లేదు'

ఆదోని టౌన్, ఏప్రిల్ 13: ఆదోనిలో కాంగ్రెస్ పార్టీను బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని ఆ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహమ్మద్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక మైనారిటీలతో పాటు, ఇతర సీనియర్ నాయకులు అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయడానికి అధిష్టానానికి దరఖాస్తు చేసుకోగా, స్థానిక వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సూచన మేరకు, పక్కన నియోజకవర్గంలోని బదినేహల్ ప్రాంతానికి చెందిన ఆయన బంధువు నిఖిల్ రెడ్డికు టికెట్ ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక మైనారిటీలకు గానీ, పార్టీ సీనియర్ నాయకులకు గానీ పోటీ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజులలో పార్టీ జెండా మోసే వారు కూడా ఉండరని హెచ్చరించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఫిర్యాదు చేసినట్లు నూర్ తెలిపారు.

బీసీ రక్షణే చంద్రబాబు ధ్యేయం



బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన ఎమ్మిగనూరు వాసులు



గోనెగండ్ల : ప్రచారంలో మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పక్కన ఎంపీ సంజీవ్‌కుమార్, బీవీ

● బీసీ కార్పొరేషన్‌ను ముక్కలు చేసి బీసీ బతుకులను బుగ్గి పాలు చేసిన దుర్మార్గుడు జగన్

● ఆర్‌డీఎస్, వేదవతి, గుండ్రేవుల పూర్తి చేస్తాం

● బస్తిపాటి నాగరాజు, బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, ఏప్రిల్ 13: బీసీ రక్షణే చంద్రబాబు నాయుడి ధ్యేయమని కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, అసెంబ్లీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జయహోబీసీ కార్యక్రమం టీడీపీ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు సంజీవ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పలు దేవాలయాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అచ్చుకట్ల వీధిలో పార్టీ జెండాను ఎగువేశారు. బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలించిన ఈ ఐదేళ్ల గ్రామాల్లో బీసీలకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఆ రోజులు పోయాయని, టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ ప్రవేశపెడుతుందని, బీసీలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని తెలిపారు. వైసీపీ నాయకులు బీసీలను రాజకీయంగా అణగతొక్కారని, చట్ట సభలలో బీసీల రిజర్వేషన్ 24 శాతానికి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్‌డీఎస్, వేదవతి, గుండ్రేవుల, ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులు చేపడతామని వారు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పాలన ఉన్నదా లేదా అనే విధంగా తయారైందని మన రాష్ట్రం పరిశ్రమలు లేక యువత, నిరుద్యోగులు పక్క రాష్ట్రలకు వలసలు పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మద్దిలేటి, టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యానాయుడు, పిల్లిగుండ్ల జయపాల్, బేతాలబడేసా, రఫీక్, రమేష్ ఆచారి, శివన్న, నూరహ్మద్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వంద కుటుంబాలు

ఎమ్మిగనూరు: పట్టణంలో పలు ప్రాంతాలకు చెందిన దాదాపు 200 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాకప్పి ఆయన పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. పట్టణ నాయకులు రామకృష్ణనాయుడు, శిల్పి భాస్కర్, ఉరుకుంద, దేవేంద్ర, అల్తాఫ్‌లు పాల్గొన్నారు.

ఆలూరులో కూటమిదే విజయం

దేవనకొండ ,ఏప్రిల్ 13: ఆలూరు నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి అభ్యర్థి బి .వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కప్పట్రాళ్ల బుజ్జమ్మ, వెంకప్ప, డీఎం వెంకట్రాముడు, బడిగింజల రంగన్న ఆధ్వర్యంలో లక్ష్మీరంగా ఫంక్షన్‌హాల్‌లో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి సొసైటీ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించి సమావేశంలో వీరభద్రగౌడ్ మాట్లాడారు. ఐదేళ్లుగా ఆలూరు ప్రాంతానికి వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమీలేదని విమర్శించారు. గ్రామాల్లో కనీసం తాగునీరు, సీసీరోడ్లు లేవన్నారు. నిత్యావసర ధరలు మూడింతలు పెంచి సామాన్యుల నడ్డివిరిచారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో వేదావతి ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.1980 కోట్లు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి ప్రజలను కష్టాలకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌లో 27 పథకాలు రద్దు చేసిన వైసీపీని ఈ ఎన్నికల్లో ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు డి. రామచంద్ర నాయుడు, రామారావునాయుడు, జగదీష్, మల్లికార్జునగౌడ్, బోడా రవి, రాం దాస్‌గౌడ్, కప్పట్రాళ్ల మల్లికార్జున,మలకన్న, సరోజ, మల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

టీడీపీ యువనేత గిరిమల్లేష్ గౌడ్ ప్రచారం

ఆలూరు 13: ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ గెలుపు కోసం తనయుడు గిరి మల్లేష్‌గౌడ్ ఆలూరు పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ, దుకాణాలకు వెళ్లి తన తండ్రి వీరభద్ర గౌడ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

ఆలూరు : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ కైరుప్పల వీరభద్రస్వామి రథోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. గ్రామస్తులు మేళతాళాలతో పసుపు రంగు బంతిపూ చల్లుతూ స్వాగతం పలికారు.

హత్తిబెళగల్‌లో : హత్తిబెళగల్‌లో రాత్రి వీరభద్రగౌడ్ ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. నాయకులు వీరాంజినేయులు, మంజు, దేవేంద్ర, తులసిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

వెల్దుర్తి, ఏప్రిల్, 13 : ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా కార్యదర్శి సుధాకర్, బాబురావు నాయకత్వంలో టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ.శ్యాంబాబు సమక్షంలో వెల్దుర్తి పట్టణానికి చెందిన వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేఈ.శ్యాంబాబు మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని పాతాళంలోకి నెట్టారని విమర్శించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం డ్రగ్స్, గంజాయిలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు తెచ్చిన పార్టీ టీడీపీయేనని, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, 50 సంవత్సరాలకే పింఛన్ అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివశంకర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, రామకృష్ణఆచారి, రామకృష్ణ, శశి, వెంకటరాముడు, గోపాల్, రామచంద్రనాయుడు, ఎర్రబజారు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పత్తికొండ మండలంలో ప్రచారం

పత్తికొండ : మండగిరి, జె.అగ్రహారం, కోతిరాళ్ల గ్రామాల్లో టీడీపీ నాయకులు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మినీమ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. యువతకు 20లక్షల ఉపాధి అవకాశాలు, ప్రతివిద్యార్థికి రూ 15వేలు ఆర్థికసాయం, ప్రతి ఇంటికి ఏడాదికి 3ఉచిత సిలిండర్లు, ప్రతిమహిళకు నెలకు రూ1500, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం వంటి పథకాలు టీడీపీ ప్రభుత్వం వచ్చాక అందిస్తుందని వివరించారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా: రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 13: నన్ను మీ ఇంటి సభ్యుడిగా భావించి ఆదరిస్తే, ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టీడీపీ మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని తారాపురం, రంగాపురం, చిన్న కడబూరు, మేకడోన, ముచ్చిగిరి, నౌలెకల్, కల్లుకుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అందరూ తోడుండి నా విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకంత్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, ఎస్సీ సెల్ నాయకులు ఏసేపు, దశరథ్ రాముడు, మీసేవ ఆంజనేయులు, దేవేంద్ర గౌడ్, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు.. రాష్ట్ర అభివృద్ధికి మలుపు

కోసిగి, ఏప్రిల్ 13: టీడీపీ గెలుపు రాష్ట్ర అభివృద్ధికి మలుపు అని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం డీసీసీ మాజీ చైర్మన్ పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. శనివారం కామన్‌దొడ్డి గ్రామంలో టీడీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, మండల కన్వీనర్ జ్ఞానేష్, చింతలగేని నర్సారెడ్డి, వీరేష్, తాయన్న, నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రచారాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

● *ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ*

● *18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు*

● *రాజకీయ పార్టీల ప్రతినిధులకు నామినేషన్, స్క్రూటీని, ఉపసంహరణలపై దిశానిర్దేశం*

ఆదోని, ఏప్రిల్ 13: రాజకీయ ప్రచారాలకు, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అన్నారు. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. సభలు-సమావేశాలు, ఊరేగింపులు-ర్యాలీలు రాజకీయ పార్టీ ప్రచారాల పై ఇంటింటి ప్రచారాలపై 48 గంటల ముందుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధన ఉల్లంఘించిన వారి పై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

● **నామినేషన్ల పరిశీలన**

అసెంబ్లీ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు 26వ తేదీ శుక్రవారం సాయంత్రం వరకు పరిశీలిస్తారని, సరైన నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల పేర్లు అదే రోజు ప్రకటిస్తారని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29 సాయంత్రం వరకు గడువు ఉంటుందని తెలిపారు. నామినేషన్ వేయడానికి అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైన్ డీఎస్పీ ధీరజ్, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎన్నికల ఉప తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, డీఎల్‌పీవో వీరభద్రప్ప, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రాలయం చేరుకున్న ఈవీఎంలు

మంత్రాలయం, ఏప్రిల్ 13: నియోజకవర్గానికి సంబంధించిన పార్లమెంటు, అసెంబ్లీలకు ఉపయోగించే ఈవీఎంలు శనివారం మంత్రాలయం చేరుకున్నాయి. స్థానిక పరిమళ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో క్రమ పద్ధతిలో ఈవీఎం బాక్సులను, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లును భద్రపరిచారు. మంత్రాలయం ఆర్వో మురళి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో మంత్రాలయం సీఐ ఎరిషావలి, ఎస్ఐ గోపినాథ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య ఈవీఎంలను భద్రపరిచి ప్రముఖ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎంలకు సీల్ వేసి తాళం వేసారు.

రేపు గంజహళ్లి బడేసాహెబ్ పూజలు

గోనెగండ్ల, ఏప్రిల్ 13: మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ స్వామి మాస పూజలు సోమవారం నిర్వహిస్తున్నట్లు దర్గా ధర్మకర్త, పీఠాధిపతులు శనివారం తెలిపారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. స్వామివారి జీవసమాధిని ప్రత్యేక పూలతో అలంకరిస్తారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం రాష్ట్ర స్థాయి పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 8374803596, 8985999786 లను సంప్రందించాలని కోరారు.

నేడు బీసీ జయహో..

మద్దికెర, ఏప్రిల్ 13: ఎం.అగ్రహారంలో ఆదివారం జయహో బీసీ కార్యక్రమాన్ని ర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ శివశంకర్, సోషల్ మీడియా కన్వీనర్ హుశేన్‌పీరా తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

కురువల మద్దతు టీడీపీకే

హొళగుంద, ఏప్రిల్ 13: కురవ సామాజిక వర్గీయులను గుర్తించిన పార్టీ టీడీపీ అని, ఈ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతుతో టీడీపీ విజయం తథ్యమని టీడీపీ జిల్లా బీసీ సెల్ మెంబర్ ఎల్లార్తి కురవ దర్గన్న, తెలుగు యువత అధ్యక్షుడు ఎండీ హళ్లి కురవ నాగరాజు శనివారం అన్నారు. స్థానిక సిద్దేశ్వర ఐస్ మిల్ వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, ఆమె భర్త కృష్ణమోహన్ వైసీపీ తీర్థం పుచ్చుకొని, ఆలూరు నియోజకవర్గ కురవలు వైసీపీ కి మద్దతు తెలిపారంటూ అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని అన్నారు. ఆమె వెంట కురువలు ఎవరూ లేరని స్పష్టం చేశారు. మాజీ సర్పంచు కేబీ వీరభద్రప్ప, సీనియర్ నాయకులు గాది లింగ, ఎండీ హళ్లి వీరనాగప్ప, మార్లమాడికి నల్లారెడ్డి, ఎంపీటీసీ బసప్ప పాల్గొన్నారు.

ఆదోనిను నందనవనంగా మారుస్తాం : బీజేపీ



బీజేపీలో చేరుతున్న గ్రామస్థులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 13: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథిని గెలిపించుకొని నియోజకవర్గాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. శనివారం స్థానిక ఎన్డీఏ కూటమి ఉమ్మడి కార్యాలయంలో బీజేపీ కార్యకర్తల విస్తృత సమావేశంలో అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పార్థసారధి, జిల్లా ఇన్‌చార్జి అంకుల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, రాష్ట్ర కార్యదర్శి సావిత్రి పాల్గొన్నారు అనంతరం మండల అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వంద కుటుంబాలకు ఎమ్మెల్యే అభ్యర్థి ఆ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బైపాస్ బాధితులకు అండగా ఉంటా : పార్థసారథి

మాస్టర్ ప్లాన్‌లో లేనివిధంగా కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణంతో తీవ్రంగా నష్టపోతున్న బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పార్థసారధి అన్నారు. కొత్త బైపాస్ రోడ్డు కారణంగా నష్టపోతున్న బాధితులు శనివారం కూటమి ఎన్నికల కార్యాలయంలో నాయకులను కలిసి తమ గోడును వినిపించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. గతంలో మంజూరైన బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేసి, అది పూర్తికాక ముందే ప్రస్తుతం తిరిగి మరొక బైపాస్ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పూనుకొని 900 కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే, అన్వబాషా రాష్ట్ర కన్వీనర్ ప్రకాష్ జైన్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సావిత్రి, సీనియర్ నాయకులు దేశాయ్ చంద్రన్న పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుకు చేరిన కంట్రోల్ యూనిట్లు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 13: ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసేందుకు అవసరమైన కంట్రోల్ యూనిట్లు ఎమ్మిగనూరుకు చేరినట్లు ఆర్వో చిరంజీవి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కంట్రోల్ యూనిట్లు 654, బ్యాలెటింగ్ యూనిట్లు 654, వీవీప్యాడ్లు 709 వచ్చాయన్నారు. వీటిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు, ఎన్నికల అధికారుల సమక్షంలో భద్రపరిచనట్లు పేర్కొన్నారు.

టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వీరేష్



బీటీ నాయుడు చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న వీరేష్

కోసిగి, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆదోని న్యాయవాది బి.వీరేష్‌ను కర్నూలు పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు శనివారం ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు.. కర్నూలులో జరిగిన టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదుల సమావేశంలో ఆదోని కోర్టులో పని చేస్తున్న న్యాయవాది బీ.వీరేష్‌ను లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియ మించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, టీడీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అభినందనలు తెలిపారు. కర్నూలు పార్లమెంటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, మండల కన్వీనర్ జ్ఞానేష్‌లు న్యాయవాది వీరేష్‌ను అభినందించారు.

నిర్మలకు బాసటగా నిలుస్తాం : కమిషన్ చైర్మన్

ఆదోని రూరల్, ఏప్రిల్ 3 : ఆస్పరి కేజీబీవీ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న నిర్మల విద్యాభివృద్ధికి బాసటగా నిలుస్తామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కొసలి అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన నిర్మల బైపీసీలో 440 మార్కులకు 421 మార్కులు సాధించి కర్నూలు జిల్లా టాపర్‌గా నిలిచిందని, నిర్మల సివిల్ చదివి పోలీస్ అధికారి కావాలనే లక్ష్యంతో ఉందని, ఆవిధంగా ఓ ప్రణాళిక బద్ధంగా ఆ విద్యార్థినిని చదివిస్తామని పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో వైష్ణవి అకాడమీ విద్యార్థుల ప్రతిభ



ఇందువాణి (940), జ్ఞానప్రసూన, అజయ్‌కుమార్

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 13: ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాల (కొండవీటి ప్రాంతం) విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు వైష్ణవి అకాడమి చైర్మన్ విష్ణుప్రభు, గ్రూప్ చైర్మన్ జి.డి లింగప్ప, కరస్పాండెంట్ సత్యశిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ప్రథమ ఎంపీసీలో జ్ఞానప్రసూన, అజయ్‌కుమార్ 462 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. అలాగే బైపీసీలో సౌభాగ్యం 430 మార్కులతో ప్రతిభచాటింది. వి.మానస 424 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 26మందికి గాను 450కి పైగా మార్కులు 10మంది విద్యార్థులు సాధించగా, బైపీసీలో 400లకు పైగా మార్కులను ఏడుగురు సాధించారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో ఇందువాణి 940 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. బైపీసీలో కళాశాలలో 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సులో ఎంఐటీలో ఈశ్వర్ 1000గాను 937 మార్కులతో రాష్ట్ర ర్యాంకును సాధించారు. ద్వితీయ స్థానంలో ఇస్మాయిల్ 904 మార్కులు సాధించారు. అలాగే ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో సురేఖ 1000 మార్కులకు గాను 943 మార్కులు, ఎంఎల్‌టీలో సాయినితిన్ 500గాను 460 మార్కులు సాధించి పట్టణ టాపర్లుగా నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఎమ్మెల్యే కుమార్తెను నిలదీసిన కాలనీవాసులు

కౌతాళం, ఏప్రిల్ 13: కాలనీ సమస్యలను పరిష్కరించిన తరువాతనే ఓటు అడగాలంటూ మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుమార్తె ప్రియాంకను ఎన్టీఆర్ నగర్ కాలనీవాసులు నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వైసీపీ మండల నాయకులు, గ్రామ సర్పంచు పాల్‌దినకరన్‌తో కలసి ఎన్టీఆర్ నగర్‌లో ప్రచారం నిర్వహించిన ప్రియాంక ఎదురుగానే గ్రామ సర్పంచు పాల్‌దినకరన్‌ను నిలదీశారు. తమ కాలనీలో సరైన డ్రైనేజి వ్యవస్థ లేదని, సరైన రోడ్లు లేవని, తమకు తాగునీరు కూడా ఎనిమిది రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీమఠం గోసంరక్షణకు రూ.లక్ష విరాళం

మంత్రాలయం, ఏప్రిల్ 13. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం గోశాలకు చెన్నైకి చెందిన భాస్కర్ ఉషారావు అనే భక్తుడు రూ. లక్ష నగదును విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు.విరాళం ఇచ్చిన దాతల కుటుంబ సభ్యులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.



కర్నూలు నగర ప్రజలకే కాదు.. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని కుటుంబం. ప్రముఖ పారిశ్రామివేత్త, టీజీవీ గ్రూప్స్ సీనియర్ చైర్మన్, మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కుటుంబం. అచ్చం ఆయన రాజకీయాన్ని, సేవాగుణాన్ని పుణికి పుచ్చుకున్నారు ఆయన తనయుడు టీజీ భరత్. తండ్రి చూపిన బాటలో పయనిస్తూ యువ పారిశ్రామికవేత్తగా.. రాజకీయ నాయకుడిగా ఎదిగారు ఆయన. నాన్న సిద్ధాంతం.. ఆశయాలు.. ప్రజా సేవ చేస్తున్న ఆయన 2019 ఎన్నికల్లో ప్రత్యేక రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. అనుభవం చెక్కిన శిల్పంగా తయారై.. అంచలంచెలుగా ఎదుగుతూ ప్రజా హృదయాలను దోచుకున్నారు. పదవులు ఉన్నా లేకున్నా నమ్ముకున్న ప్రజలకు సేవా చేయాలనే మహా సంకల్పం సామాజిక సేవా కార్యక్రమాల్లో మమేకం చేసింది. సాయం కోరి వచ్చిన వారికి లేదు అనకుండా తోచిన సాయం అందిస్తున్నారు. ఇప్పటికీ కర్నూలు నగరంలో ఏ వీధికి వెళ్లినా టీజీ కుటుంబం చేసిన సేవా కార్యక్రమాలు దర్శనమిస్తాయి. తమ సంస్థల్లో వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు.. నిరుపేద జంటలకు ఉచితంగా వివాహాలు చదువు, వైద్యం కోసం ఆర్థిక సాయం.. వివిధ సేవా సంస్థలు, కళాకారులకు చేయుతనిస్తూ టీజీ కుటుంబం ముందుకెళ్తోంది. ఏ పదవీ లేకున్నా ప్రజల చెంతనే.. ప్రజా సేవకే మమేకమైన తండ్రీ, కుమారులె కర్నూలు ప్రజల్లో మంచి స్థానాన్ని సాధించుకున్నారు. ప్రస్తుతం టీజీ భరత్ తెలుగుదేశం పార్టీ తరపున కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు. ఈ క్రమంలో టీజీ కుటుంబం చేసిన సేవలు, సహాయ, సహకారాలు నియోజకవర్గ ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

– కర్నూలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)



ప్రజా సేవలోనే...

- తండ్రి టీజీ వెంకటేశ్ బాటలో తనయుడు టీజీ భరత్
- పేదలకు ఆపన్న హస్తం అందిస్తున్న టీజీవీ గ్రూప్స్
- నగరంలో చాలా చోట్ల సేవా కార్యక్రమాలు
- యువతకు ఉద్యోగాలు, విద్య, వైద్యం కోసం ఆర్థిక సాయం
- కుల, మతాలకతీతితంగా వేలాది జంటలకు ఉచిత వివాహాలు
- ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న తండ్రీకొడుకులు



నిరుద్యోగుల కోసం గత నెలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా సందర్భంగా మాట్లాడుతున్న టీజీ భరత్



సామూహిక వివాహాల వేడుకల్లో నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న టీజీ వెంకటేశ్, టీజీ భరత్ కుటుంబం



కర్నూలులో టీజీ వెంకటేశ్ ఉచిత వైద్య సేవా భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీజీ భరత్, వైద్యులు (ఫైల్)



శ్రీశైలంలో నిర్మించిన వాసవి అన్నదాన సత్రం ప్రారంభోత్సవంలో టీజీ వెంకటేశ్ దంపతులు, టీజీ భరత్ దంపతులు, అధికారులు (ఫైల్)



శ్రీశైలంలో టీజీవీ గ్రూప్స్ ఆర్థిక సాయంతో నిర్మించిన అన్నదాన సత్రం (ఫైల్)

మన టీజీ.. మన కర్నూలు

కర్నూలు నగరం అంటే టీజీ కుటుంబానికి అమితమైన ప్రేమ. అందుకే ప్రజలకు ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు. నలభై ఏళ్లుగా ప్రజా సేవా కార్యక్రమాల్లో తరిస్తున్నారు. అంతేకాదు.. టీజీ వెంకటేశ్ ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా కర్నూలు నియోజకవర్గం సహా జిల్లా అభివృద్ధిలో తన ముద్ర చాటుకున్నారు. అదే తరహాలో పదవులు లేకపోయినా తండ్రి అడుగు జాడల్లో నడుస్తు యువనేత టీజీ భరత్ నేను సైతం అంటూ సామాజిక, ప్రజా సేవల్లో దూకుడు పెంచారు. స్వచ్ఛంద సంస్థలైనా.. కళాకారుల సంఘాలైనా.. సామాజిక సేవా సొసైటీలైనా.. యువజన సంఘాలైనా.. క్రీడలు ప్రోత్సాహక సంఘాలైనా ఎవరు ఏ కార్యక్రమం చేపట్టినా అందులో టీజీ కుటుంబం సాయం, సహకారం ఉండాల్సిందే. టీజీవీ గ్రూప్స్ చేపట్టిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలే అందుకు నిదర్శనం. రాయలసీమ విశ్వవిద్యాలయం ఏర్పాటులో టీజీ కృషి ఎనలేనిది. జిల్లాలో ఎందరు విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి కందనవోలు కేంద్రంగా బీజం వేశారు. రూ.కోటి సొంత డబ్బును ఖర్చు చేసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు అంతర్జాతీయ సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించి విద్యార్థులకు అండగా నిలిచారు. సామాన్యులు సైతం తమ పిల్లల వివాహాలు తక్కువ ఖర్చుతో దర్జాగా కల్యాణ మండపాల్లో నిర్వహించి గౌరవాన్ని చాటుకోవాలనే సేవా సంకల్పంతో.. టీజీ లక్ష్మీ వెంకటేశ్ పేరిట ఎస్‌ఏపీ క్యాంప్, ఆఫీసర్స్ క్లబ్ బీ క్యాంప్, మాలగేరి, దండిగేరి ఇలా 17కు పైగా టీజీవీ కల్యాణ మండపాలను నిర్మించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. నగరంలో ఎక్కడకు వెళ్లినా టీజీ లక్ష్మి వెంకటేశ్ కల్యాణ మండపం, కమ్యూనిటీ హాల్స్, కళాక్షేత్రాలు దర్శనమిస్తున్నాయి. కరోనా సమయంలో ఆక్సిజన్ అందక ఎందరో ఇబ్బందులు పడ్డారు. వాటికి స్వస్తి చెబుతూ.. రూ.కోటి ఆర్థిక సాయం అందించి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనం నిర్మాణం, ఆక్సిజన్ ఉత్పత్తి చేసే యంత్రాలు (మిషనరీ) అందించి సేవా గుణం చాటుకున్నారు.

అభాగ్యులకు అండగా...

తమ పిల్లల చదువు, వైద్యం కోసం సాయం కోరి వచ్చిన అభాగ్యులకు అండగా మేము ఉన్నాం అంటూ చేయుత అందిస్తున్నారు. నలభై ఏళ్లుగా టీజీ వెంకటేశ్ కుటుంబం 'సరిలేరు మాకెవ్వరు' అంటూ ముందుకు సాగుతోంది. విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగులు)కు ఎలక్ట్రిక్ ట్రైస్కూటర్స్, ట్రై సైకిల్స్ ఉచితంగా అందించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. అభయగిరి క్షేత్రంలో ఆశ్రమం పొందుతున్న కళల ప్రపంచానికి చేరువవుతున్న మానసిక దివ్యాంగులకు అండగా నిలిచారు టీజీ భరత్. స్వయంగా అభయగిరి క్షేత్రానికి వెళ్లి వారితో గడపడమే కాకుండా వారి ఆకలి తీర్చాలనే ఆశయంతో ఏటా రూ.1.50 లక్షలు విలువైన నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. ఆరోగ్య భద్రతకు శ్రీకారం చుట్టారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆ క్షేత్రానికి చేరుకోవడానికి 500 మీటర్లు మేర సీసీ రోడ్డు వేయించారు.

యువతలో స్ఫూర్తిని నింపుతూ...

బీటెక్, ఎంటెక్, డిగ్రీ, పీజీ.. వంటి ఉన్నత చదువులు చదివినా సరైన ఉద్యోగాలు రాక యువతరం అవకాశాల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. మీ కంపెనీల్లో ఏదైనా చిన్న ఉద్యోగం ఉంటే ఇవ్వండి సార్..! అంటూ తన వద్దకు వచ్చే యువతరాన్ని చూసి టీజీ భరత్ చలించిపోయారు. యువ పారిశ్రామికవేత్తగా తనకు వివిధ కంపెనీల ప్రతినిధులతో ఉన్న పరిచయాలతో మెగా జాబ్ మేళాలు నిర్వహించారు. అంతేకాదు.. తమ టీజీవీ గ్రూప్స్ సంస్థల ద్వారా ప్రత్యేక్షంగా, పరోక్షంగా పది వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇవీన్న కూడా ఓ వ్యక్తిగా చేసేశారు. ఓ పారిశ్రామిక వ్యక్తిగా ఇన్ని సేవలు చేసిన తాను ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీకి వెళ్లాక నియోజకవర్గంలో నిరుద్యోగిత లేకుండా చేస్తానని హామీ ఇస్తున్నారు టీజీ భరత్.

'చల్లని' ఆలోచన..



జిల్లా నలుమూల నుంచి వివిధ అవసరాల కోసం ప్రజలు జిల్లా కేంద్రం కర్నూలు నగరానికి వస్తుంటారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులు క్రయ విక్రయాల కోసం రాయలసీమ జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా వస్తుంటున్నారు. ముఖ్యంగా వేసవిలో దాహంతో ఏ ఒక్కరు కూడా తల్లడిల్లరాదనే 'చల్లని' ఆలోచనతో టీజీ కుటుంబం ప్రజల దాహం తీర్చింది. నిత్యం ప్రజలు రద్దీగా ఉండే కలెక్టరేట్, ఆసుపత్రి, మార్కెట్ యార్డు, విద్యా సంస్థలు సహా నగరంలో ప్రతి వార్డులో టీజీవీ గ్రూప్స్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేశారు. దాదాపు రూ.3.19 కోట్లు సొంత నిధులు ఖర్చు చేసి నగర వ్యాప్తంగా 46 ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్స్ నిర్మించారు. వాటి నిర్వహణ కోసం ఏటా రూ.25 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత మినరల్ ప్లాంట్స్ నెలకొల్పి 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు' సొంతం చేసుకున్నారు.

క్రీడలకు ప్రోత్సాహం...

నగరంలో క్రీడలను ప్రోత్సహించాలనే సంకల్పంతో టీజీ భరత్ నేతృత్వంలో ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో టీజీ షటిల్ కోర్టు నిర్మించారు. నగరంలో క్రీడల ప్రోత్సాహానికి టీజీ కుటుంబం ఎనలేని కృషి చేస్తోంది. విద్యార్థులు, యువత క్రీడా రంగంలో ఉన్నత స్థాయిలో రాణించేందుకు తోడ్పాటును అందిస్తోంది. వీరి సహకారంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయంగా రాణించిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు.



టీజీవీ గ్రూప్స్ చైర్మన్, రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ఆర్థిక సాయంతో నిర్మించిన ఐఎంఏ భవనం (ఫైల్)



ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న టీజీ భరత్ (ఫైల్)

రూ.25 కోట్ల విలువైన భూదానం

వాసవి సత్ర సముదాయం నిర్వహణలో పేద విద్యార్థుల సంక్షేమం కాంక్షిస్తూ టీజీ లక్ష్మీ వెంకటేశ్ వాసవీ వైశ్య బాలుర వసతి గృహం (బాయ్స్ హాస్టల్) నిర్మాణం కోసం భూమిని అందజేశారు. ఆ భూమి ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం రూ.25 కోట్లు ఉంటుందని అంచనా. బాలికల హాస్టల్ నిర్మాణం కోసం రూ.1.50 కోట్ల ఆర్థిక సాయం అందించారు. పేదల విద్యార్థులు సైతం ఈ వసతి గృహాల్లో ఉంటూ చదువుకోవడానికి అవకాశం కల్పించి విద్యా ప్రదాతగా నిలిచింది టీజీ వెంకటేశ్, టీజీ భరత్ కుటుంబం. శ్రీశైలం మల్లన్న దర్శనార్థం దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఆకలి తీర్చేలనే లక్ష్యంగా రూ.కోటి వెచ్చించి అన్నదాన సత్రం నిర్మించి తమ సేవానిరతిని మరోసారి చాటుకున్నారు. కర్నూలు నగరం దూపాడు సమీపంలో రూ.కోటి ఖర్చు చేసి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కుల, మతాలకు అతీతంగా ఆలయాలు, ప్రార్థన మందిరాల నిర్మాణాలకు ఆర్థిక సాయం అందించి ఆధ్యాత్మిక ప్రదాతగా నిలుస్తున్నారు. రాజకీయాలకతీతంగా నలభై ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.



మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ కుటుంబం



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న టీజీ వెంకటేశ్(ఫైల్)

పేదలకు పెళ్లిళ్లు...



నూతన దంపతులతో టీజీ వెంకటేశ్ కుటుంబం (ఫైల్)

వివాహం అంటేనే ఖర్చుతో కూడుకున్నది. పేదలు తమ ఆడబిడ్డలకు వివాహాలు చేయాలంటే ఎంత తక్కువ కాదన్నా రూ.లక్షకు పైగా ఖర్చు వస్తుంది. ఎందరో పేద తల్లిదండ్రులు తమ కూతురికి పెళ్లి చేయాలి.. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయి.. ఏదైనా సాయం చేయండయ్యా..! అంటూ సాయం కోరుతూ తమ వద్దకు వస్తున్న వారిని చూసి ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు యువ పారిశ్రామికవేత్త టీజీ భరత్‌లు తల్లిదండ్రులుగా మారి ఆడబిడ్డల పెళ్లిళ్లు నిర్వహించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమానికి 2003లో శ్రీకారం చుట్టారు. నాటి నుంచి ప్రతి ఏటా రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ జన్మదినం పురస్కరించుకుని కుల మతాలకు అతీతంగా వారి సంప్రదాయాలకు ఏమాత్రం తగ్గకుండా ఉచితంగా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు. నూతన దంపతులకు పట్టువస్త్రాలు, తాలిబొట్టు, కాళిమెట్టెలు సహా రూ.60 వేలు ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నారు. దంపతులు ఇరుకుటుంబాల వైపు నుంచి వచ్చిన బంధువులకు వివాహ భోజనాలతో ఓ పండుగ వాతావరణంలో సామూహిక వివాహాలు నిర్వహించడం టీజీ కుటుంబానికి ఓ మైలురాయిగా నిలిచింది.

